'అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమును మట్టితో చేసి "అయిపో" అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు. అసలు వాస్తవం ఇది. అది మీ ప్రభువు తరపు నుండి మీకు తెలుపబడుతోంది. దాన్ని శంకించేవారిలో నీవు చేరిపోకు"

(దివ్యఖుర్ఆన్: 3 : 59-60)

తండ్రి లేకుండా జన్మించిన కారణంగా ఏసుక్రీస్తును ఆరాధిస్తుంటే, ఆదమ్ అంతకన్నా ఆరాధనకు ఎక్కువ అర్హుడు. ఎందుకంటే ఆయన తల్లి తండ్రీ ఇద్దరు లేకుండా జన్మించారు.

## ఏసుక్రీస్తు మహత్యాలు

ఏసుక్రీస్తు జన్మ మహిమాన్వితమైనది. ఆయన తండ్రి లేకుండా సృష్టించబడ్డారు. ఆయన దైవాభీష్టంతో, దేవుని అనుమతితో స్వయంగా అనేక మహిమలు ప్రదర్శించారు.

ఊయలలో శిశువుగా ఉన్నప్పుడే ఆయన మాట్లాడారు. తన తల్లిని నిందిస్తున్న వారికి జవాబిచ్చారు. దివ్యఖుర్ఆన్ ప్రకారం మరణించిన వారిని బ్రతికించారు. గుడ్డివారికి చూపు వచ్చేలా చేశారు. కుష్ఠు రోగులను బాగు చేశారు. ఇదంతా ఆయన దేవుని అభీష్టం ప్రకారమే చేశారు.

ఏసుక్రీస్తు (ఆయనపై దైవశాంతి కురియుగాక) మహత్యాలు ప్రదర్శించడమన్నది ఆయన దేవునికి వినమ్రుడైన దాసుడు కాదనడానికి నిదర్శనమేమీ కాదు. నిజానికి చాలా మంది దైవప్రవక్తలు మహత్యాలు ప్రదర్శించారు. నూహ్ ప్రవక్త, మూసా ప్రవక్త, ముహమ్మద్ ప్రవక్త (వారందరిపై దైవశాంతి కురియుగాక) అందరూ మహత్యాలు ప్రదర్శించారు. ఈ మహత్యాలు దైవాభీష్టం ప్రకారమే జరిగాయి. ఆ విధంగా వారు తాము ప్రవక్తలమని నిరూపించారు.

## ఏసుక్రీస్తు సందేశం

పాతనిబంధనలోని ప్రవక్తలు.. ఇబ్రాహీమ్, నూహ్, యోనా ఎవ్వరూ దేవుడు త్రిత్వంలో భాగమని చెప్పలేదు. ఏసుక్రీస్తు తమ రక్షకుడని వాళ్ళు భావించలేదు. వారి సందేశం చాలా సరళమైనది. ఒకే ఒక్క దేవుడున్నాడు. ఆయన మాత్రమే ఆరాధనలకు అర్హుడు. ఇదే ఆ సందేశం. వేలాది సంవత్సరాలుగా ఒకే సందేశాన్ని వివిధ ప్రవక్తల ద్వారా పంపుతూ వచ్చిన దేవుడు అకస్మాత్తుగా ఆ సందేశాన్ని మార్చాడని భావించలేము. అకస్మాత్తుగా తాను త్రిత్వంలో భాగంగా చెప్పాడని అనుకోలేం.

వాస్తవమేమంటే ఏసుక్రీస్తు కూడా తనకు ముందు వచ్చిన పాతనిబంధనలోని ప్రవక్తల సందేశాన్నే ప్రచారం చేశారు. ఈ కీలకమైన సందేశాన్నినొక్కి చెప్పే బోధన బైబిల్లోనూ ఉంది. ఒక మనిషి ఏసుక్రీస్తు వద్దకు వచ్చి "ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనది ఏది అని అడిగెను. ఓ ఇశ్రాయేలూ! వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. (మార్కు 12:28-29)

కాబట్టి అత్యున్నతమైన నిబంధన, అతి ముఖ్యమైన విశ్వాసం ఏసుక్రీస్తు ప్రకారం, దేవుడు ఒక్కడే అన్నది. ఏసుక్రీస్తు దేవుడైనట్లయితే ఆయన "నేను దేవుడిని నన్ను ఆరాధించండని" అనేవారు. కాని ఆయన అలా అనలేదు. పాతనిబంధనలోని ఒక వాక్యాన్ని చదివి దేవుడు ఒక్కడే అని బోధించారు.

> ఈసా(అ) ఇలా అన్నారు:
> ..."మీరు అల్లాహ్‌కు భయపడండి..
> యదార్థం ఏమిటంటే,
> అల్లాహ్‌యే మీ ప్రభువూ,
> నా ప్రభువూను.
> ఆయననే మీరు ఆరాధించండి.
> ఇదే సరియైన మార్గం."
> (దివ్యఖుర్ఆన్ 43:64)

ఏసుక్రీస్తు ఇస్రాయీల్ ప్రజల వద్దకు తనకన్నా ముందు వచ్చిన ప్రవక్తల సందేశాన్ని – ఒకే దేవుని విశ్వసించాలన్న సందేశాన్ని ధృవీకరించడానికి వచ్చారన్న ఇస్లామీయ బోధనల ప్రకారమే ఈ మాట ఉంది.

దేవుని విధేయుడైన దాసుని మాదిరిగా ఏసుక్రీస్తు దేవుని నిబంధనలకు తలొగ్గారు. ఆ విధంగా ఆయన ఒక ముస్లిమ్(దైవ విధేయుడు). ముస్లిమ్ అంటే దేవుని ఆదేశాలకు తలొగ్గే వాడు.

## ఇస్లామ్‌లో ఏసుక్రీస్తు

ఏసుక్రీస్తు దేవుడు పంపించిన గౌరవనీయుడైన ప్రవక్త. ఆయన ఒకే దేవుని ఆరాధించాలన్న సందేశమిచ్చారు. ఇది బైబిల్‌లోనూ ఉంది. దివ్యఖుర్ఆన్ దానిని ధృవీకరిస్తోంది. ఏసుక్రీస్తు గురించి ఇస్లామీయ విశ్వాసం ఏసుక్రీస్తు అసలు ఎవరన్నది వివరిస్తుంది. దేవునికి సంబంధించిన స్వచ్ఛమైన విశ్వాసాన్ని కొనసాగిస్తూ, ఆయన ఔన్నత్యాన్ని, పరిపూర్ణతను స్పష్టంగా ప్రకటించే వివరణ ఇది.

ఇస్లామ్ గురించి మరింత అవగాహన, అధ్యయనం చేయాలని ఆహ్వానిస్తున్నాము. ఇది మరో మతం ఎంత మాత్రమూ కాదు. నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఏసుక్రీస్తు, ముహమ్మద్‌లు బోధించిన సందేశమే ఇది. వారందరిపై దైవశాంతి కురియుగాక. ఇస్లామ్ అంటే దేవునికి విధేయత చూపడం. ఇది సహజమైన, పరిపూర్ణమైన జీవన విధానం. మనిషి తనకు దేవునికి మధ్య సంబంధాన్ని, సృష్టికి దేవునికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేలా చేసే విధానం. ఇస్లామ్ ప్రకారం దేవుడు న్యాయశీలుడు, కరుణామయుడు. పాపాలను క్షమించడానికి తన్ను తాను బలిపెట్టవలసిన అవసరం లేనివాడు. దేవుడు ప్రతి ఒక్కరిని వారి ఆచరణల ప్రకారం తీర్పునిస్తాడు. ప్రతి ఒక్కరూ తమ కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంది.

దైవప్రవక్తలందరినీ గౌరవించాలని ఇస్లామ్ బోధిస్తుంది. కాని దైవప్రవక్తలను ప్రేమించడం, గౌరవించడం అంటే వారిని ఆరాధించడం కాదు. ఎందుకంటే ఆరాధన అన్నది కేవలం దేవునికి మాత్రమే ప్రత్యేకం. ఏసుక్రీస్తును ఒక ప్రవక్తగా గుర్తించి, వాస్తవాన్ని స్వీకరించడం అనేది క్రైస్తవ గుర్తింపును కోల్పోవడం కూడా కాదు. నిజానికి ఇది ఏసుక్రీస్తు బోధించిన స్వచ్ఛమైన బోధనలను అనుసరించడమే.

సంప్రదించండి

**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

IIC

**040 - 6832 7832** - Hyderabad

# ఏసుక్రీస్తు

# దైవ ప్రవక్త

## ముస్లిములు ఏసుక్రీస్తును ప్రేమిస్తారు



**మౌలిక విషయాలు** తెలుసుకుందాం

**040 - 6832 7832**

**Toll Free 1800 572 3000**

**www.discovertruepath.com**

**You Tube : DiscoverTruePath**

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజలు ప్రేమించే, గౌరవించే మహాపురుషుడు ఏసుక్రీస్తు. కాని ఆయన గురించి చాలా అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ముస్లిములు, క్రైస్తవులు ఏసుక్రీస్తు పట్ల అత్యున్నతస్థాయి గౌరవమర్యాదలు కలిగి ఉంటారు. కాని ఈ రెండు సముదాయాలు ఏసుక్రీస్తును చూసే దృష్టికోణం విభిన్నమైనది.

ఈ కరపత్రం ఏసుక్రీస్తు గురించి ఉన్న భావాల్లో స్పష్టత కోసం ఉద్దేశించినది. ఏసుక్రీస్తు దేవుడా? లేక ఆయనను దేవుడు పంపించాడా? నిజమైన, చారిత్రకమైన ఏసుక్రీస్తు ఎవరు?

## "దేవునిగా ఏసుక్రీస్తు"

కొందరు క్రైస్తవులు ఏసుక్రీస్తును దేవునిగా భావిస్తారు. లేదా త్రిత్వంలో భాగంగా భావిస్తారు. అంటే ఆయన భూమిపై దేవుని అవతారం, దేవుడు మనిషి రూపమెత్తి భూమిపైకి వచ్చాడని. కాని బైబిలు ప్రకారం, ఏసుక్రీస్తు జన్మించారు. ఆయన ఆహారం భుజించారు. నిద్రించారు. ప్రార్థించారు. ఆయన జ్ఞానం కూడా పరిమితులకు లోబడినదే. ఈ లక్షణాలు దేవునికి పొసగనివి. దేవుడు పరిపూర్ణుడు. మనిషి అందుకు విరుద్ధం. ఒకే సమయంలో ఒకటే విషయం పరిపూర్ణమూ, అసంపూర్ణమూ కావడం అసంభవం.

ఇస్లామ్ ప్రకారం దేవుడు ఎల్లప్పుడు పరిపూర్ణుడు. దేవుడు మనిషిగా మారాడని చెప్పడమంటే, దేవుడు ఏదో ఒక సమయంలో అసంపూర్ణుడిగా ఉన్నాడని భావించడం. కాబట్టి ఆలోచించవలసిన విషయమేమంటే, దేవుడు ఒక దశలో బలహీనమైన శిశువుగా ఉన్నాడా? ఆహారం, నీరు, నిద్ర లేకుండా బ్రతకలేని స్థితిలో ఉన్నాడా? ఇలాంటి దేవుడినే పాత నిబంధనలో చెప్పడం జరిగిందా? ముమ్మాటికీ కాదు.

దేవుడు ఏదన్నా చేయగలిగినప్పుడు దేవుడు మనిషిగా ఎందుకు మారలేడని కూడా ప్రశ్న రావచ్చు. దేవుడు దైవత్వానికి వ్యతిరేకమైన పనులేవీ చేయడన్నది మౌలికమైన విషయం. దేవుడు, దేవుడు కాకుండా చేసే పని ఏదీ దేవుడు చేయడు. దేవుడు మనిషిగా మారితే, మనిషి లక్షణాలు స్వీకరిస్తే ఇక దేవునిగా మిగలడు.

బైబిలులోని కొన్ని అస్పష్టమైన వాక్యాల ద్వారా ఏసుక్రీస్తుకు దైవత్వం ఉందని చెప్పడం జరుగుతోంది. కాని మనం బైబిలులో ప్రత్యక్షంగా స్పష్టంగా ఉన్న వాక్యాలను పరిశీలిస్తే ఏసుక్రీస్తును ఒక అసాధారణ వ్యక్తిగా మాత్రమే చెప్పడం జరిగింది. అంతకు మించి కాదు. బైబిలులో అనేక చోట్ల ఏసుక్రీస్తు తాను, దేవుడు వేరువేరు అన్నట్లు మాట్లాడడం, వ్యవహరించడం మనకు కనబడుతుంది. ఉదాహరణకు :

- ఏసుక్రీస్తు తన ముఖాన్ని నేలకాన్చి ప్రార్థించారు (మత్తయి 26:39). ఏసుక్రీస్తు దేవుడైనట్లయితే, దేవుడు అలా ముఖం నేలకాన్చి ప్రార్థిస్తాడా? ఎవరిని ప్రార్థిస్తున్నట్లు?
- బైబిలు ఏసుక్రీస్తును ఒక ప్రవక్తగా చెబుతుంది (మత్తయి 21: 10–11). ఏసుక్రీస్తు స్వయంగా దేవుడు, దైవప్రవక్త రెండు ఒకే సమయంలో కావడమన్నది ఎలా సాధ్యం?
- ఏసుక్రీస్తు ఇలా అన్నారు: "నేను తండ్రి వద్దకు వెళుతున్నాను... ఎందుకంటే తండ్రి నా కన్నా గొప్పవాడు" (యోహాను : 14:28)
- ఏసుక్రీస్తు ఇలా అన్నారు : "నేను నా తండ్రి వద్దకు, మీ తండ్రి వద్దకు, నా దేవుని వద్దకు, మీ దేవుని వద్దకు పైకెక్కుతున్నాను" (యోహాను : 20:17) ఏసుక్రీస్తు దేవుడైనట్లయితే ఆయన "నా దేవుడు, మీ దేవుడు" అని ఎందుకన్నట్లు? ఆయన ఎవరి వద్దకు పైకి వెళుతున్నట్లు?

ఏసుక్రీస్తు దేవుడైనట్లయితే ఆయన స్పష్టంగా ప్రజలను తనను ఆరాధించాలని చెప్పి ఉండేవారు. బైబిల్లో ఇలాంటి స్పష్టమైన వాక్యాలు ఉండవలసింది. కాని ఆయన అందుకు వ్యతిరేకంగా మాట్లాడారు. తనను ఆరాధించడం పట్ల అయిష్టం వ్యక్తం చేశారు. ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? ... నీ నామమున అనేక అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు – నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును. (మత్తయి 7:22–23)

## "దైవకుమారుడు"

కొందరు క్రైస్తవులు ఏసుక్రీస్తు దేవుని కుమారుడంటారు. దీనికి అసలు అర్థమేమిటి? దేవుడు భౌతికంగా, నిఘంటు అర్థం ప్రకారం కొడుకును కలిగి ఉండడమన్నది దేవునికి పొసగని విషయం. మనుష్యులకు మానవ సంతానం ఉంటుంది. పిల్లలకు పిల్లల సంతానం ఉంటుంది. దేవుడు ఒక కుమారుని కలిగి ఉండడమంటే అర్థమేమిటి? దేవునికుమారుడన్న మాటను నిఘంటు ప్రకారం భౌతికంగా దేవుని కుమారుడని భావించే బదులు ఇది సంకేతప్రాయమైన పదంగా భావించాలి. ప్రారంభ కాలంలోని బైబిలు భాషలో పుణ్యపురుషులను ఉద్దేశించి సంకేతప్రాయంగా దైవకుమారుడన్న పదాన్ని ఉపయోగించేవారు. ఈ పదం దావూద్ (డేవిడ్), సులైమాన్ (సోలమాన్), ఇస్రాయీల్‌లకు కూడా ఉపయోగించడం జరిగింది. కేవలం ఏసుక్రీస్తుకు మాత్రమే ప్రత్యేకంగా ఉపయోగించిన పదం కాదు. ..."ఇస్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్ఠ పుత్రుడు." (నిర్గమ 4:22). నిజానికి పుణ్యపురుషులెవరినైనా దైవకుమారుడిగా పిలిచేవారు. "దేవుని ఆత్మ ద్వారా నడిపించబడే వారందరూ దేవుని కుమారులు" (రోమీయులకు 8:14)

> "ఎవరినైనా తన కుమారునిగా చేసుకోవడం అనేది అల్లాహ్‌కు తగిన పద్ధతి కాదు. ఆయన పరమ పవిత్రుడు. ఏ విషయాన్ని గురించైనా ఆయన నిర్ణయం తీసుకుంటే, "అయిపో" అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది."
> దివ్యఖుర్‌ఆన్

## "తండ్రి & కుమారుడు"

అదేవిధంగా తండ్రి అన్న పదాన్ని దేవుని ఉద్దేశించి వాడినప్పుడు ఆ పదం భౌతికంగా, నిఘంటు అర్థం ప్రకారం తండ్రిని సూచించడానికి వాడింది కాదని, సంకేతప్రాయంగా సృష్టికర్త, పోషకుడు, అందరి ప్రభువు అయిన దేవుని సూచించడానికి వాడిందని భావించాలి. "తండ్రి" అన్న పదం సంకేతప్రాయంగా ఉపయోగించారని చెప్పడానికి అనేక వాక్యాలున్నాయి. ఉదాహరణకు, "ఒకే దేవుడు, అందరి తండ్రి" (ఎఫెసీయులకు 4:6)

అంతేకాదు, కొన్ని సందర్భాల్లో శిష్యులు ఏసుక్రీస్తును ప్రభువా అని పిలిచేవారు. బైబిలు మూలభాషల్లో ఈ పదం ఉపయోగించబడింది. ఈ పదం దేవుని సూచించడానికే కాదు, అత్యుత్తమస్థాయికి చెందిన మనుష్యులను సూచించడానికి కూడా ఉపయోగించేవారు. ఉదాహరణకు గ్రీకు భాషలోని కొత్త నిబంధనలో "కిరియోస్" అన్న పదాన్ని ప్రభువు అనే అర్థంలో ఉపయోగించడం జరిగింది. అలాగే "అవిధేయుడైన నౌకరును కొట్టిన ప్రభువు" (లూకా 20:42:47)

బైబిలులోని కొన్ని చోట్ల ఏసుక్రీస్తును శిష్యులు దేవుని సేవకుడిగా కూడా పిలిచారు. 'మన పితరుల దేవుడు తన సేవకుడైన ఏసును మహిమ పరచియున్నాడు." (అపోస్తలుల : 3:13). వీటన్నింటిని బట్టి ఏసుక్రీస్తును సూచించడానికి ప్రభువు అన్న పదం ఉపయోగించినప్పుడు అది కేవలం గౌరవపూర్వకంగా వాడిన పదమే తప్ప దైవత్వం సూచించడానికి కాదు.

దేవుని గురించి, ఏసుక్రీస్తు గురించి ఈ సంక్లిష్టమైన భావనలను వివరించే ప్రయత్నాలు జరిగాయి. ఈ వివరణలు కొన్ని అయోమయంగానూ, సంతృప్తి కలిగించలేనివిగానూ ఉన్నాయి. అయితే ఆలోచించవలసిన ముఖ్యమైన విషయమేమంటే, ఈ విషయం అర్థం కానంత కఠినంగా దేవుడెందుకు చేస్తాడు? ఇస్లామ్‌లోని దైవభావనకు సంబంధించి సరళమైన, స్వచ్ఛమైన, స్పష్టమైన బోధనలతో పోల్చితే ఇవి ఎలా కనబడుతున్నాయి?

## ఏసుక్రీస్తు : ఒక ప్రవక్త

యూదమతంలో ఏసుక్రీస్తును మెసయ్యగా కూడా గుర్తించడానికి నిరాకరించడం జరిగింది. కాగా మరోవైపు క్రైస్తవంలో ఆయనను దేవునిగానూ, దైవకుమారునిగానూ ఆరాధించడం జరుగుతోంది. ఇస్లామ్ మధ్యేమార్గాన్ని అవలంబించింది. ఏసుక్రీస్తును గౌరవప్రదుడైన దేవుని ప్రవక్తగా, దైవసందేశహరునిగా గుర్తిస్తుంది. ఏసుక్రీస్తును మెసయ్యగా గుర్తిస్తుంది. కాని ముస్లిములు ఏసుక్రీస్తును ఆరాధించడం జరగదు. ఎందుకంటే ఆరాధన అనేది కేవలం దేవునికి మాత్రమే ప్రత్యేకం. దేవుడే ఏసుక్రీస్తునూ, సమస్తాన్నీ సృష్టించినవాడు.

> "ఏసుక్రీస్తు ఇలా అన్నారు "నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు. నన్ను ప్రవక్తగా నియమించాడు."
> (దివ్యఖుర్‌ఆన్ 19:30)

## మహిమాన్వితమైన జన్మ

దివ్యఖుర్‌ఆన్ ప్రకారం దైవదూత జిబ్రాయీలును మేరి మాత వద్దకు పంపడం జరిగింది. ఆమె పవిత్ర కన్య. దైవదూత మనిషి రూపంలో అక్కడకు వచ్చాడు. దైవదూత ఆమెకు తండ్రిలేని కుమారుడు దైవికంగా జన్మిస్తాడని తెలియజేశాడు.

> "అతను (దైవదూత జిబ్రాయీలు) "నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇచ్చేందుకు పంపబడ్డాను" అని చెప్పాడు. మర్యమ్, "నాకు పుత్రుడు ఎలా పుడతాడు, నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా లేదు, నేను చెడునడత గలదానినీ కాను" అని అన్నది. దైవదూత ఇలా అన్నాడు, "అలాగే జరుగుతుంది" నీ ప్రభువు, "అలా చేయడం నాకు చాలా సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా, మా తరపునుండి ఒక కారుణ్యంగా చేయాలని మేము ఈ పని చేస్తున్నాము. ఇది జరిగి తీరవలసిన విషయమే" అని సెలవిస్తున్నాడు. (దివ్యఖుర్‌ఆన్ 19 : 19–21)

ఈ మహిమాన్వితమైన జన్మ ఏసుక్రీస్తు దైవత్వానికి రుజువుగా కొందరు వాదిస్తారు. కాని తండ్రిలేకుండా జన్మించింది ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కురియుగాక) ఒక్కరే కాదు. ఆయన మొదటి వాడు కాదు. ప్రవక్త ఆదమ్ (ఆయనపై శాంతి కురియుగాక) తల్లి తండ్రి ఇద్దరూ లేకుండానే సృష్టించబడ్డారు. దేవుడిలా అన్నాడు :